ప్రజల కష్టాలు తీరేనా?

కిన్నెరసాని ప్రాజెక్ట్ గేట్లు ఎత్తితే జలదిగ్బంధంలో పల్లెలు

- మునుగుతున్న పంటలు, స్తంభిస్తున్న రాకపోకలు
- బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్న పలు గ్రామాల ప్రజలు
- శాశ్వత పరిష్కారం కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న జనం


గతేడాది కిన్నెరసాని గ్రామంలోని ఇళ్లలోకి చేరిన వరద నీరు (ఫైల్)

పాల్వంచరూరల్: వర్షాకాలం వచ్చిందంటే ఎప్పుడు వరద మొదలవుతుందా.. ఎలా బయటపడాలా? అనే ఆందోళన అక్కడి ప్రజల్లో మొదలవుతుంది. మండలంలోని కిన్నెరసాని జలాశయం సమీపాన ఉన్న గ్రామాల్లో ఏటా ఇదే పరిస్థితి ఉంటోంది. 407 అడుగుల నీటినిల్వ సామర్థ్యం కలిగిన కిన్నెరసాని ప్రాజెక్టుకు 14 క్రస్ట్ గేట్లు ఉండగా.. వరద అధికంగా వస్తే గేట్లు ఎత్తేయడంతో దిగువన పరీవాహక ప్రాంతాలు ముంపునకు గురువుతున్నాయి. దీంతో ఇళ్లకే కాక పంటలు నష్టపోయి రైతులు, ప్రజలు భయం భయంగా గడుపుతున్నారు. అయితే, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోవడం వారి ఆందోళనకు కారణమవుతోంది.

ముంపుప్రాంతాలు ఇవే..

కిన్నెరసాని ప్రాజెక్టు గేట్లు ఎత్తినప్పుడు మొదట కిన్నెరసాని, యానంబైల్ ముంపునకు గురవుతాయి. ఆ తర్వాత సూరారం, పాండురంగాపురం, సోములగూడెం, రంగాపురం, నాగారం, నారాయణరావుపేట, బూర్గంపాడు మండలంలో పినపాక పట్టీనగర్, సాంపెల్లి, బూర్గంపాడు గ్రామాలు ఉంటాయి. ఆయా గ్రామాల్లో ఇళ్లే కాకుండా వందల ఎకరాల పొలాలు, మోటార్లు మునగడం సాధారణమైపోయింది. గతేడాది ఇదే నెలలో కిన్నెరసాని ప్రాజెక్టు 12 గేట్లు ఒక్కసారిగా ఎత్తడంతో కిన్నెరసాని గ్రామంలోని సగం మేర ఇళ్లలోకి వరద నీరు చేరింది. రైతులు నష్టపోగా, రంగాపురం వద్ద రాకపోకలు నిలిచిపోయాయి. యానంబైల్‌లోనూ అదే పరిస్థితి నెలకొంది. ఇక భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారిలోని రంగాపురం బ్రిడ్జి కొంత వరద కోతకు గురికావడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

24 గ్రామాలకు రాకపోకలు బంద్

కిన్నెరసాని ప్రాజెక్టుకు చెందిన ఒక్క గేటు ఎత్తినా యానంబైల్, రాజాపురంలో లెవల్ చప్టాపై వరద ప్రవహిస్తుంది. దీంతో ఎగువన ఉన్న 24 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. ఫలితంగా ఆటోలు, ద్విచక్రవాహనాలు కిన్నెరసాని ప్రాజెక్టు బ్రిడ్జి మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి ఉంటుంది.

బ్రిడ్జి పూర్తయితే..

రాజాపురం, యానంబైల్ గ్రామాల మధ్య కిన్నెరసాని వాగుపై 2014లో రూ.9.70 కోట్ల వ్యయంతో బ్రిడ్జి మంజూరైంది. అనంతరం ఎడతెగని జాప్యం జరగగా, బ్రిడ్జి పనులు 2021 – 2022లో ప్రారంభమైనా నేటికీ పూర్తికాలేదు. గతేడాది బ్రిడ్జి పనులు పూర్తి చేయాల్సి ఉంది. అయినప్పటికీ కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పూర్తి కాకపోవడంతో ఏటా వానాకాలంలో 24 గ్రామాల ప్రజలకు తిప్పలు తప్పడం లేదు.


రంగాపురం - సోములగూడెం వద్ద నీట మునిగిన పొలాలు

ఇలా చేస్తే మేలు

కిన్నెరసాని ప్రాజెక్టు గేట్లు ఎత్తినప్పుడల్లా వందల ఎకరాల పొలాలు మునగడమే కాక కిన్నెరసాని గ్రామంలో నివాసాలు వరద ముంపునకు గురవుతున్నాయి. అలాకాకుండా అధికారులు రిజర్వాయర్ నీటిమట్టం 402 అడుగుల వద్ద స్థిరీకరిస్తూ అంతకంటే పెరగగానే రెండు, మూడు గేట్లు ఎత్తితే నష్టతీవ్రత తక్కువగా ఉంటుంది. కానీ, 403 అడుగుల వరకు నీరు వచ్చేలా చూసి ఆపై వరద పెరిగితే ఎక్కువ గేట్లు ఎత్తడంతో నష్టం ఎక్కువగా నమోదవుతోంది.

ఏటా నష్టపోతున్నాం..



కిన్నెరసాని ప్రాజెక్టు గేట్లు ఎత్తినప్పుడల్లా పంటలు నష్టపోతున్నాం. గతేడాది మొత్తం గేట్లు ఎత్తడం వల్ల ఇళ్లలోకి కూడా నీరు వచ్చింది. ఇక పంటలు పూర్తిగా నీటి మునిగి నష్టపోయాం. పంటలకు పరిహారం ఇవ్వాలని జెన్‌కో యాజమాన్యం, కలెక్టర్‌ను కోరితే అంచనా వేసి పరిహారం చెల్లించలేదు.

–తారాచంద్, రైతు, రంగాపురం

తక్కువ ఎత్తితే నష్టం ఉండదు..



అధికారులు ఏటా ఎక్కువగేట్లు ఎత్తుతుండటంతో పలు గ్రామాల్లో వందల ఎకరాల పంట పొలాలు నీట మునిగి దెబ్బతిన్నాయి. దిగుబడి రాలేదు. కొందరు రైతుల పంపుసెట్లు కొట్టుకుపోయాయి. గేట్లు తక్కువగా ఎత్తితే నష్టం తగ్గుతుంది. నష్టపోయిన వారికి పరిహారం ఇవ్వాలి.

–వీరన్న, రైతు, సోములగూడెం

ఒక రోజు ముందే ప్రచారం



ప్రాజెక్టులోకి వరద పెరిగితే గేట్లు ఎత్తక తప్పదు. గేట్లను ఎత్తే ఒకరోజు ముందు పరివాహక గ్రామాల్లో సిబ్బంది ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నాం. గేట్లు ఎత్తే గంట ముందు కూడా సైరన్ మోగించి అపమత్తం చేశాకే నీటిని దిగువకు విడుదల చేస్తున్నాం.

–ప్రభాకర్‌రావు, కేటీపీఎస్ 5వ దశ సీఈ

ప్రమాద రహిత వారోత్సవాలు షురూ


మాట్లాడుతున్న ఎంవీఐ మనోహర్

చుంచుపల్లి: ఆర్టీసీలో ఈ నెల చివరి వరకు జరగనున్న ప్రమాద రహిత వారోత్సవాలను బుధవారం కొత్తగూడెం డిపోలో ఎంవీఐ మనోహర్‌తో కలిసి డిపో మేనేజర్ ఎం.దేవేందర్‌గౌడ్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డిపోలో ఉన్న ప్రతి డ్రైవర్, కండక్టర్ మెయింటెనెన్స్ మెకానిక్‌లు సంస్థ అభివృద్ధిలో అత్యంత ముఖ్యమైన వారన్నారు. డిపో పరిధిలో డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్ సిబ్బంది అందరికీ ఈ వారోత్సవాల సందర్భంగా అవగాహన కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఇసనపల్లి శామ్యూల్, సునీత, బాబూరావు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న నాయకులు

సుజాతనగర్: పది రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ నాయకుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలను సుజాతనగర్‌లో బుధవారం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేయకపోవడంతో రైతులకు పరిహారం అందడం లేదన్నారు. ఇకనైనా బీమా యోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు నరేంద్రబాబు, చింతలచెర్వు శ్రీనివాసరావు, భూక్యా రవినాయక్, నాగేంద్ర ప్రసాద్, భట్టు శివ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య లోపం లేకుండా చూడాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ, తదితరులు

పాల్వంచరూరల్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదమున్నందున గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం లేకుండా కార్యదర్శులు పర్యవేక్షించాలని ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆయన ఇంటింటా ఇన్నోవేటర్ ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడారు. వీధుల్లో ఎక్కడ కూడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, దోమల నివారణకు ప్రతీ వారం ఫాగింగ్ చేయించాలని సూచించారు. అనంతరం ఇన్నోవేషన్ సెల్ జిల్లా కోఆర్డినేటర్ దివ్య మాట్లాడుతూ.. ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో భాగంగా ప్రతిభ ఉన్న వారి వివరాలను కార్యదర్శులు సమర్పించాలని చెప్పారు. అనంతరం బదిలీపై వెళ్తున్న కార్యదర్శులు రణధీర్, రాజశేఖర్, రాజు, అనిల్, నాగేశ్వరరావు, సతీశ్‌ను సత్కరించారు. సమావేశంలో ఎంపీఓ బి.నారాయణ, ఏపీఓ రంగా పాల్గొన్నారు.

దోమతెరలు పంపిణీ చేయండి

ఇల్లెందురూరల్: పల్లెల్లో జ్వరాలు ప్రబలుతున్నాయని, అందుకు కారణమైన దోమల బారి నుంచి ప్రజలను కాపాడేందుకు తక్షణం దోమతెరలు పంపిణీ చేయాలని బీఎస్పీ జిల్లా కోఆర్డినేటర్ కాంపాటి నరేశ్ కోరారు. మండలంలోని కొమరారం గ్రామంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వాన స్థితికి చేరుకోవడం, దోమల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవడం ప్రజలకు శాపంగా మారిందని తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి


మిల్క్ పార్లర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సుజాతనగర్: మహిళలు నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ ఆర్థిక స్థిరత్వం సాధించాలని సెర్ప్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సునందన్ సూచించారు. మహిళాశక్తి పథకంలో భాగంగా డ్వాక్రా రుణాలతో మహిళలు ఏ ర్పాటు చేసిన యూనిట్లను సుజాతనగర్‌లో బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కూరగాయల పెంపకం, అమ్మకం, బేకరీ, బ్యూటీపార్లర్, కర్రీ పాయింట్ల ఏర్పాటుతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. సెర్ప్ స్పెషల్ ఆఫీసర్ వెంకయ్య, మీరాంబి, శిరీష, భారతి, వీఓఏలు మాధవి, రజిత పాల్గొన్నారు.

దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలి

కొత్తగూడెంఅర్బన్: దివ్యాంగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన స్మితాసబర్వాల్‌పై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, దివ్యాంగులకు ఆమె బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేశ్ డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంధం మల్లికార్జున్‌రావు, మాలోత్ వీరునాయక్, వంగా రవిశంకర్, తాటిపాముల హరికృష్ణ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో అన్యాయం

పాల్వంచ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ఆయన బుధవారం పాల్వంచలో మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలంగాణ ఊసెత్తలేదని విమర్శించారు. రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రులుగా కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఉన్నా ఈ విషయంలో స్పందించకపోవడం సరికాదని పేర్కొన్నారు.

సామాన్యులకు నిరాశ

జూలూరుపాడు: కేంద్ర బడ్జెట్‌లో సామాన్యులకు నిరాశే మిగిలిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఎస్.కే. చాంద్‌పాషా వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. పంటలకు కనీస మద్దతు ధర, ఉపాధి హామీ పథకానికి సరిపడా బడ్జెట్ కేటాయించలేదని ఆరోపించారు. అలాగే, విద్యా, వ్యవసాయ, ఉపాధి రంగాలకు సరైన స్థాయిలో నిధులు కేటాయించలేదని తెలిపారు.

క్లుప్తంగా

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతుల దహనం



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో ప్రజలకు ఒరిగేదేం లేదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు అన్నవరపు కనకయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాసు తెలిపారు. బుధవారం కొత్తగూడెంలో బడ్జెట్ కాపీలను దహనం చేశాక వారు మాట్లాడారు. గ్రామీణ పేదలు, రైతులు, కూలీలు, నిరుద్యోగులకు ఎలాంటి పథకాలను ప్రకటించకపోగా కార్పొరేట్లకు రాయితీలు ఇవ్వడం గర్హనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎం.జ్యోతి, భుక్యా రమేశ్, కోట బాలకృష్ణ, సిద్దెల రాములు, రఘు, సంధ్యారాణి, రాము, నర్సింహారావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్క నాటుతున్న ఎంపీపీ శాంతి

చుంచుపల్లి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, అందుకోసం మొక్కలు విరివిగా నాటాలని చుంచుపల్లి ఎంపీపీ బాదావత్ శాంతి పిలుపునిచ్చారు. బుధవారం బాబూక్యాంప్ ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎం నీరజ ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఓ గుంటి సత్యనారాయణ, ఎంఈఓ జుంకీలాల్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, పాఠశాల సిబ్బంది స్వాతి, స్టెల్లా సునందిని, రమాదేవి, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

పడమట నర్సాపురంలో వరుస చోరీలు

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురం గ్రామంలో వరుస చోరీలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సోమవారం అర్ధరాత్రి ఓ ఇంట్లోని ద్విచక్రవాహనాన్ని చోరీ చేశారు. మరుసటి రోజైన మంగళవారం కూడా కొత్తూరు నరసింహారావు కిరాణా దుకాణం షట్టర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు గడ్డపారతో లేపేందుకు ప్రయత్నించారు. ఇది గమనించి యజమాని కేకలు వేయడంతో వారు పారిపోయారు. ఈ నెల 3న కూడా డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయం ఎదురుగా ఉన్న బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ బ్యాటరీలు, ఓ రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కాపర్‌వైర్ చోరీకి గురైంది. ఇలా వరుస చోరీలతో గ్రామస్తులు ఆందోళన చెందుతుండగా, పోలీసులు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చేరాలి


బుడగం రవికుమార్‌కు కేక్ తినిపిస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి లబ్ధిదారుడికి అందేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ కోకన్వీనర్ బుడగం రవికుమార్ కోరారు. బీజేపీ నేత తాండ్ర వినోద్‌రావు జన్మదినం సందర్భంగా బుధవారం పట్టణంలో కేక్ కట్ చేశారు. రాజు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఎదుట ఆందోళన

ఇల్లెందు: ఏడాది కాలంగా రుణాలు ఇవ్వకుండా పలు కారణాలు చెబుతున్నారని ఆరోపిస్తూ యూనియన్ బ్యాంక్ ఎదుట పోడు రైతులు బుధవారం ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు భూక్యా వీరభద్రం, నబీ, నరేంద్ర, శోభన్‌నాయక్, తాళ్లూరి కృష్ణ, ఆలేటి కిరణ్, ధనమ్మ, వెంకన్న, వెంకటనర్సమ్మ, మేమ్లా, రాజేశ్ పాల్గొన్నారు.

బియ్యం వితరణ

ఇల్లెందురూరల్: మండలంలోని బోయితండాకు చెందిన గుగులోత్ సుగుణ ఇటీవల మృతిచెందగా ఆమె కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు బుధవారం 50 కిలోల బియ్యం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జిల్లా నాయకుల ఆదేశాల మేరకు బియ్యం అందించామన్నారు. జగదీశ్, తారాచంద్, మంగీలాల్, ప్రేం, గుగులోత్ నరేశ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

‘పెద్దవాగు’ బాధితులను ఆదుకోవాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అశ్వారావుపేట పెద్దవాగు ప్రాజెక్టుకు గండిపడి పంట నష్టపోయిన రైతాంగాన్ని అన్నివిధాలా ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ అనుబంధ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ.. 16,500 ఎకరాల వరకు రైతులు నష్టపోయారని, భూముల్లో ఇసుక మేటలు వేయడంతో సాగుకు పనికి రాకుండా పోయాయని తెలిపారు. కార్యక్రమంలో సలిగంటి శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాసరావు, చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, బండి నాగేశ్వరరావు, శనిగరపు శ్రీనివారావు, కృష్ణమూర్తి, పాషా పాల్గొన్నారు.

బస్టాండ్‌ను పరిశీలించిన డీఎం


బస్టాండ్‌ను పరిశీలిస్తున్న డీఎం దేవేందర్‌గౌడ్

ఇల్లెందు: స్థానిక బస్టాండ్, డిపోను కొత్తగూడెం డిపో నూతన మేనేజర్ దేవేందర్‌గౌడ్ పరిశీలించారు. బుధవారం డిపోలో ప్రమాద రహిత వారోత్సవాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఇల్లెందు ఎస్ఐ నాగుల్‌మీరా, బి.సంజీవరాణి, ఏఎంఎఫ్ నారాయణ, సిస్టమ్ సూపర్‌వైజర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

టేకులపల్లి: కొత్తగూడెం నుంచి వయా బోడు మీదుగా గుండాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నేతలు ఎట్టి నరసింహారావు, దుబాకుల ప్రసాద్ బుధవారం కొత్తగూడెం డీఎం దేవేందర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులకు బల్లలు వితరణ


బల్లలు అందిస్తున్న అధికారులు, ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పీవీకే–5 ఇంక్‌లైన్ ఉద్యోగులు సమకూర్చిన నగదుతో ప్రాథమిక పాఠశాలకు బల్లలను వితరణగా అందించారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో గని మేనేజర్ పాలడుగు శ్రీనివాస్ బల్లలను అందజేసి, మాట్లాడారు. నగదు సమకూర్చినవారికి కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా విద్యార్థులకు ఎలాంటి అవసరం ఉన్నా తమవంతు సాయం అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అజయ్‌కుమార్, హుమాయిన్, చిలక రాజయ్య, విజయగిరి శ్రీనివాస్, ఎస్.నాగేశ్వరరావు, సకినాల సమ్మయ్య, సొప్పరి సుధాకర్, గొర్రె రాజయ్య, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సత్కారం


బదిలీపై వెళ్తున్న ఉద్యోగులను సత్కరిస్తున్న దృశ్యం

ఇల్లెందు: మున్సిపాలిటీలో పనిచేసి, బదిలీపై వెళ్తున్న ఉద్యోగులను మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. ఇల్లెందు మున్సిపాలిటీలో 8 మంది వివిధ ప్రాంతాలకు బదిలీపై వెళ్తుండగా.. 14 మంది బదిలీపై ఇల్లెందుకు వచ్చారు. కార్యక్రమంలో కమిషనర్ యాదగిరి, మేనేజర్ అంకుషావలి, డీఈ నవీన్, ఏఈ కుమారస్వామి, ఆర్ఐ శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ కార్యదర్శులకు రిలీవ్ ఉత్తర్వులు

ఇల్లెందురూరల్: సాధారణ బదిలీ ప్రక్రియలో మండలం నుంచి 14 మంది కార్యదర్శులు బదిలీ అయ్యారు. గ్రేడ్–2 కార్యదర్శులలో ఒకరికి తిరిగి మండలంలోనే అవకాశం దక్కగా మరో ఇద్దరు ఇతర జిల్లాలకు బదిలీ అయ్యారు. వీరికి ఇంకా పంచాయతీలను కేటాయించలేదు. మిగిలిన 11 మంది గ్రేడ్–4 కార్యదర్శులలో ఒకరికి తిరిగి మండలంలోనే అవకాశం లభించగా మిగతా పది మంది ఇతర మండలాలకు బదిలీ అయ్యారు. ఇప్పటివరకు విధులు నిర్వహించిన గ్రామపంచాయతీల నుంచి 11 మందిని రిలీవ్ చేస్తూ ఉత్తర్వులను బుధవారం మండల పంచాయతీ అధికారి చిరంజీవి అందజేశారు. బదిలీ అయిన గ్రామ పంచాయతీలకు వీరంతా గురువారం వెళ్లనుండగా.. ఇల్లెందుకు బదిలీపై వస్తున్న కార్యదర్శులూ అదే రోజు విధుల్లో చేరే అవకాశం ఉంది.

జీపీ సెక్రటరీలు బదిలీ

జూలూరుపాడు: మండలంలోని పలు గ్రామాల సెక్రటరీలు బదిలీ అయ్యారు. సాయిరాంతండా సెక్రటరీ లక్ష్మీ కారుకొండకు బదిలీ కాగా, ఈ స్థానానికి చంద్రుగొండ మండలం సీతాయిగూడెం సెక్రటరీ బోడా బాబూలాల్ వచ్చారు. గురువాగుతండా సెక్రటరీ సరిత దమ్మపేట మండలం శ్రీరామ్‌పురానికి బదిలీ కాగా, చంద్రుగొండ మండలం మంగయ్యబంజర సెక్రటరీ పాలెపు ప్రసాద్ ఇక్కడికి వచ్చారు. శంభునిగూడెం సెక్రటరీ మాధురి తెలగరామవరానికి బదిలీ కాగా.. పాల్వంచ మండలం నాగారంకాలనీ సెక్రటరీ తెల్లబోయిన సతీశ్ ఇక్కడికి వచ్చారు. మాచినేనిపేట సెక్రటరీ ఎం.విజయలక్ష్మి.. సుజాతనగర్ మండలం కొమటిపల్లికి బదిలీ కాగా.. ఈ స్థానానికి సుజాతనగర్ మండలం సింగభూపాలెం సెక్రటరీ రోకటి లక్ష్మీనర్సయ్య వచ్చారు. అనంతారం సెక్రటరీ కె.మల్లిక సుజాతనగర్ మండలం లక్ష్మీదేవిపల్లికి బదిలీ కాగా, ఇక్కడికి చంద్రుగొండ మండలం పోకలగూడెం సెక్రటరీ శైలజ వచ్చారు. జూలూరుపాడు సెక్రటరీ సునీత, పడమటనర్సాపురం సెక్రటరీ తిరుపతిరావు ఖమ్మం జిల్లాకు బదిలీ కాగా, ఈస్థానాలకు ఎవరినీ కేటాయించలేదు.

ఘనంగా కేటీఆర్ జన్మదినం


పాల్వంచ: పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు


ఇల్లెందు: రక్తదానం చేస్తున్న కార్యకర్తలు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు జన్మదినాన్ని రామవరంలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో, పాల్వంచలో, ఇల్లెందులో, టేకులపల్లిలో, ఇల్లెందు మండలం కొమరారంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం ఇల్లెందులో కేక్ కట్ చేశారు. వైద్యశాలలో పాలు, పండ్లు పంపిణీ చేశారు. రక్తదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే హరిప్రియతోపాటు దిండిగాల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

–సాక్షి నెట్‌వర్క్

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం ఇస్తున్న (హెచ్142) నాయకులు

పాల్వంచ: విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(హెచ్142), ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (327) బాధ్యులు బుధవారం హైదరాబాద్‌లో జెన్‌కో సీఎండీ రోనాల్డ్ రాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. కేటీపీఎస్‌లోని వైద్యశాలలో డిజిటల్ ఎక్స్ విధానం రూపొందించాలని, లాబరేటరీని ఆధునికీకరించాలని, ముగ్గురు వైద్యులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో కేవీ రామారావు, కె.వెంకటరెడ్డి, డి.సత్యరాజ్, వెంపటి వెంకటేశ్వర్లు, కె.పుల్లారావు, కె.శ్రీధర్, స్వామి పాల్గొన్నారు.